# తబూక్ యుద్ధ నేపథ్యంలో
# హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 21.11.2025 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ
نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠించిన అనంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

తబూక్ యుద్ధం గురించి ప్రస్తావన జరుగుతెండెను. ఈ యాత్ర గురించి మరిన్ని వివరాలను ఈ రోజు ప్రస్తావింతును. ఈ సందర్భంగా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ఇబ్బంది కలిగించడానికి దాంబికులు చేసిన ప్రయత్నాలు కూడా ప్రస్తావించబడ్డాయి. ఆ విషయ వివరాలు ఇట్లు గలవు. వాస్తవానికి తబూక్ యుద్ధం వెనుక యూదులు, క్రైస్తవులు, దాంబికుల ఉమ్మడి కుట్రలు ఉండెను. మదీనా నుండి తబూక్ వరకు ప్రయాణం నిజానికి మృత్యు లోయకు ప్రయాణంతో సమానంగా ఉండెను. తిరిగి వచ్చే ప్రయాణంలో దారి రెండుగా చీలిపోయే ఒక ప్రదేశంలో దాంబికులు ఒక కుట్ర పన్నారు. అక్కడ ఒకటి లోయ గుండా వెళ్ళే పొడవైన మార్గం, మరొకటి ఇరుకైన, కష్టతరమైన కొండ మార్గం ఉండెను, ఈ మార్గం చిన్నది కూడా. ముస్లిం సైన్యం కొండ మార్గం గుండా వెళుతున్నప్పుడు రాత్రిపూట జన సమూహం మధ్య దాంబికులందరూ మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒంటె చుట్టూ గుమిగూడి ఆ ఒంటెను బలవంతంగా కొండ అంచు వైపు తరిమి, దాని వీపు పైన ఉండే పల్లకి తాళ్ళను కత్తిరించాలని ప్రణాళిక రచించారు. ఈ విధంగా ఒంటె (నఊజుబిల్లాహ్) దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను లోయలో పడేస్తుందని భావించారు. అల్లాహ్ తఆలా ఈ కుట్ర గురించి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలియజేశాడు. ఫలితంగా ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం తమ ముగ్గురు అనుచరులు తప్ప మరెవరూ కొండ మార్గం గుండా వెళ్లకూడదని ప్రకటించారు

అయినప్పటికీ పన్నెండు నుండి పదిహేను మంది దాంబికులు వెంటనే తమ ముఖాలను గుడ్డతో కప్పుకొని వేగంగా కొండ మార్గం వైపుకు వెళ్లి అకస్మాత్తుగా ఒంటెను తరిమివేయడం ప్రారంభించి దానిని భయపెట్టి ప్రమాదంలో పడేసి తాము కోరుకున్న కుట్రలో (నఊజుబిల్లాహ్) విజయం సాధించాలని సంకల్పించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కొండ మార్గంలో నడుస్తున్నప్పుడు అకస్మాత్తుగా ప్రజల అడుగుల చప్పుడు ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం విన్నారు. వారు ఒంటె దగ్గరకు వచ్చి

దానిని భయపెట్టారు. దీని కారణంగా కొంత సామాను కూడా క్రింద పడిపోయింది. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దాడి చేసి ఆ దాంబికులను భయపెట్టమని హజ్రత్ హుజైఫాను ఆజ్ఞాపించారు. కాబట్టి హజ్రత్ హుజైఫా (రజి) కర్రతో దాంబికుల సవారీలను కొట్టడం ప్రారంభించారు. అప్పుడు ఓ అల్లాహ్ శత్రువులారా! ఒక పక్కకు తప్పుకోండని అరిచారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ కుట్ర గురించి తెలుసుకున్నారని దాంబికులు గ్రహించారు. కావున వారు వెంటనే పక్కకు జరిగి, తిరిగి వచ్చి సైన్యంలో కలిసిపోయారు.

ఒక కథనం ప్రకారం అల్లాహ్ తఆలా ఆ దాంబికుల పేర్లను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలియజేశాడు. అందుకే మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ హుజైఫాతో నేను నీకు ఒక రహస్యం చెప్పబోతున్నానని అన్నారు. అప్పుడు ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఆ దాడి చేసిన వారి పేర్లను అల్లాహ్ తఆలా నాకు చెప్పాడు, కనుక నేను వారి అంత్యక్రియల ప్రార్థన చేయకూడదని నాకు ఆజ్ఞాపించబడిందని అన్నారు.

మక్కా విజయం తర్వాత దాంబికుల కుట్రలు మరింత పెరిగాయి. యూదుల తెగలు తమ శక్తిని కోల్పోయాయని వారు చూసినప్పుడు, రోమన్ కైసర్ వంటి బయటి శక్తుల నుండి సహాయం తీసుకోవాలని ప్రణాళిక రచించుకున్నారు. దీనితో పాటు మదీనాలో కూడా ఒక శాశ్వత కేంద్రాన్ని సృష్టించాలని వారు భావించారు. ముస్లింలకు వ్యతిరేకంగా కుట్రలు చేయగల, ఆయుధాలను నిల్వ ఉంచేకోగల ఒక కేంద్రం ఉండాలని దాంబికుల ప్రణాళిక. అయినప్పటికీ బయటి ముస్లింలకు ఎటువంటి అనుమానం రాకుండా ఆ కేంద్రాన్ని సృష్టించాలని కూడా వారు కుట్రలు పన్నారు.

కొద్దికాలం పాటు అదృశ్యమైన అబూ ఆమిర్ అకస్మాత్తుగా ముందుకు వచ్చాడు. అపోహలు సృష్టించి ప్రచారం చేసేవారు అతన్ని అబూ ఆమిర్ రాహిబ్ (సన్యాసి) అని పిలవడం ప్రారంభించారు. అబూ ఆమిర్ ఖజ్రజ్ తెగకు చెందినవాడు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాకు వలస వచ్చిన తర్వాత అతను మక్కాకు వెళ్లి ఖురైష్‌ను మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో పోరాడటానికి ప్రేరేపించాడు. తన స్వదేశానికి దూరంగా ఒంటరిగా మరణించాలని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అతని గురించి ప్రార్థించారు. మీరు ఖుబాలో ఒక మసీదును నిర్మించి, అక్కడ మీ సైనిక స్థావరాన్ని స్థాపించి యుద్ధానికి సిద్ధం చేయాలని దాంబికులకు అబూ ఆమిర్ సూచించాడు. అబూ ఆమిర్ స్వయంగా రోమన్ సామ్రాజ్యం వైపుకు వెళ్లి, సిరియాలో రోమన్ చక్రవర్తి కైసర్‌ను ముస్లింలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టాడు. ముస్లింలు తక్కువ సంఖ్యలో బలహీనంగా ఉన్నారని, ముస్లింలు చాలా పేదవారని, వారికి ఎక్కువ మంది శత్రువులు ఉన్నారని, వారితో భయపడాల్సిన అవసరం లేదని అతను కైసర్‌కు చెప్పాడు. అయితే మీరు ఇప్పుడే వారిపై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో వారు మీ సామ్రాజ్యానికి ప్రమాదకరంగా మారతారని కూడా అతను చెప్పాడు. కైసర్ అతన్ని తన వద్ద ఉంచుకొని అతన్ని ఓదార్చాడు. సహాయం చేస్తానని కూడా వాగ్దానం చేశాడు. ఈ సమయంలోనే అబూ ఆమిర్

తన సహ మతస్థులకు, కుట్రదారులైన సహచరులకు త్వరలో పెద్ద సైన్యంతో మదీనాపై దాడి చేస్తానని శుభవార్త చెప్పాడు. కాబట్టి నా కోసం ఒక బలమైన స్థావరాన్ని నిర్మించండి! అని తెలిపాడు. ఈ కారణంగా దాంబికులు ఖుబా (గ్రామం) లో ఒక మసీదును నిర్మించారు. ఈ మసీదును మస్జిదె జిరార్ అంటారు. అబూ ఆమిర్ కోరిక కూడా నెరవేరలేదు. ఎందుకనగా చివరికి అతను హిజ్రి తొమ్మిదవ లేదా పదవ సంవత్సరంలో సిరియాలోనే ఒంటరిగా తన స్వదేశానికి దూరంగా మరణించాడు.

దాంబికులు మసీదు నిర్మాణం పూర్తి చేసినప్పుడు వారు ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను తమ మసీదులో ప్రార్థన చేయాలని అభ్యర్థించారు. దైవ నిర్ణయం ప్రకారం మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తబూక్ యుద్ధం కోసం బయలుదేరడానికి సిద్ధమవుతున్నప్పుడు దాంబికులు ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఉండిరి. కావున నేను ప్రయాణానికి సిద్ధమవుతున్నందున ఇప్పుడు చాలా పనులలో నిమగ్నమై ఉన్నానని ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం బదులిచ్చారు. ప్రయాణం నుండి తిరిగి వచ్చిన తర్వాత ఈ మసీదులో మేము ప్రార్థన చేస్తామని కూడా చెప్పారు. తబూక్ యుద్ధం నుండి తిరిగి వచ్చిన తర్వాత అల్లాహ్ తఆలా సవార్త వాణి ద్వారా ఈ మసీదు గురించి ఆయన సల్లల్లాహు అలైహి వసల్లంనకు వాస్తవం తెలియజేసి ఇట్లు సూచించెను. ఇబ్బంది కలిగించడానికి, అవిశ్వాసాన్ని వ్యాప్తి చేయడానికి, విశ్వాసులలో విభేదాలు సృష్టించడానికి, అల్లాహ్, అతని ప్రవక్తతో ఇప్పటికే పోరాడుతున్న వ్యక్తికి దాక్కునే స్థలాన్ని అందించడానికి ఒక మసీదును నిర్మించారు. మేము మంచి తప్ప మరేమీ కోరుకోలేదని వారు తప్పకుండా ప్రమాణం చేస్తారు. కానీ వారు నిశ్చయంగా అబద్ధీకులని అల్లాహ్ సాక్ష్యం ఇస్తున్నాడు. ఈ సువార్తవాణి తర్వాత మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మస్జిదె జిరార్‌ను కూల్చివేయమని ఆజ్ఞాపించారు. అందువల్ల ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఆజ్ఞ ప్రకారం ఆ మసీదును దహనం చేసి నేలమట్టం చేశారు.

ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాకు తిరిగి వచ్చినప్పుడు అసిమ్ బిన్ అదీ తన ఇంటిని నిర్మించుకోవచ్చునని అతనికి ఇవ్వాలనుకున్నారు. కానీ హజ్రత్ అసిమ్ క్షమించమని అభ్యర్థించారు. కావున ఈ స్థలాన్ని సాబిత్ బిన్ అర్కమ్‌కు ఇవ్వాలని సూచించారు. ఎందుకంటే అతనికి నివాస స్థలం లేకుండెను. ఈ విధంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ స్థలాన్ని సాబిత్ బిన్ అర్కమ్‌కు ప్రసాదించారు.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్హు ఇలా ఉపదేశించారు. దాంబికులు ఇంత పెద్ద కుట్రకు పాల్పడినను మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారికెలాంటి శారీరక లేదా ఆర్థిక శిక్ష విధించలేదు.

దాదాపు రెండు నెలల ప్రయాణం తర్వాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాకు తిరిగి వస్తుండిరి. ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం మదీనా నగరాన్ని చూడగానే ఇట్లనిరి. ఈ పర్వతం (ఉహుద్) మనల్ని ప్రేమిస్తుంది మరియు మనం దానిని ప్రేమిస్తాము. అనగా ప్రవక్త హజ్రత్

ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు మదీనాలోని ప్రతి ఒక్క ప్రదేశం పట్ల ప్రేమ ఉండెను.

ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. నేను మదీనాకు త్వరగా చేరుకోవాలని ఆశిస్తున్నాను. నా వెంట రావాలనుకునే వారు రావచ్చును.

తబూక్ యుద్ధం నుండి తిరిగి వస్తున్నప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులతో ఇట్లనిరి. మదీనాలో కొంతమంది ఉన్నారు. మీరు లోయను దాటినా లేదా ప్రయాణించినా వారు మీతోనే ఉండిరి. ఓ అల్లాహ్ సందేశహరుడా! వారు మదీనాలో ఉండి మా వెంట ఎలా ఉండగలరని అనుచరులు అడిగారు. వారు మదీనాలోనే ఉన్నారు. అనారోగ్యం వంటి ఏదో ఒక అడ్డంకి వారిని ఆపింది అని ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం వివరించారు. మరొక కథనం ప్రకారం ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం తిరిగి వచ్చినప్పుడు అల్లాహ్ తఆలాకు కృతజ్ఞతలు తెలుపుతూ ఇట్లనిరి. ఈ ప్రయాణంలో మాకు ప్రతిఫలం, బహుమతి, పుణ్యాలు అనుగ్రహించిన అల్లాహ్ తఆలాకు సర్వ ప్రశంసలు. మా వెనుక ఉన్నవారిని కూడా ఈ ప్రతిఫలం, బహుమతిలో మాతో చేర్చాడు. దీని గురించి హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా ఇలా అన్నారు. తమరు ప్రయాణ కష్టాలను భరించినందుకు తమరు ఈ ప్రతిఫలానికి, బహుమతికి అర్హులయ్యారు. కష్టాలను భరించకుండా వారు ఈ ప్రతిఫలంలో ఎలా పాలుపంచుకోగలిగారు? దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు బదులిచ్చారు. వ్యాధి కారణంగా ఆపబడిన వ్యక్తులు మా సహచరులు. అల్లాహ్ ప్రమాణంగా! మా ఆయుధాల కంటే శత్రువుపై వారి ప్రార్థన మరింత ప్రభావవంతంగా ఉంది.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం రాక సందర్భంగా మదీనా ప్రజలు నగరం వెలుపలికి వచ్చి గీతాలు పాడి, కవితలు చదివి ఆయనకు స్వాగతం పలికారు.

ముగింపులో హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇలా అన్నారు: జీవిత చరిత్రకు సంబంధించిన మరికొన్ని సంఘటనలు, కోణాలు ఉన్నాయి. వాటిని ముందు ప్రస్తావింతును. ఇన్షా అల్లాహ్.

---

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔